సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



పేదల నెత్తిపై కూటమి 'బండ'

వంట గ్యాస్ ధరను సిలిండర్‌కు రూ.50 చొప్పున చమురు కంపెనీలు పెంచాయంటూ ప్రకటించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు పెద్ద షాక్ ఇచ్చింది. -8లో



మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

ఇంటి నుంచి బయటికి వచ్చిన మతిస్థిమితం లేని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
38.8/25.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం 25.4 - 38.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

11లోపు అభ్యంతరాలు తెలపాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్, కర్నూలు పూర్వపు జిల్లాలలోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి గ్రేడ్ –2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు(గవర్నమెంట్) తాత్కాలిక జాబితా వెబ్‌సైట్ https://rjdsekadapa.blogspot.com లో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలిపారు. కావున ఏవైనా అభ్యంతరాలు ఉన్నచో సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో తగిన ఆధారాలతో ఈ నెల 11లోపు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

పరిహారం అందించేందుకు కృషి



అధికారులతో సమీక్ష నిర్వస్తున్న మంత్రి సవిత

పులివెందుల రూరల్: నియోజకవర్గంలో పది రోజుల క్రితం వీచిన ఈదురు గాలులు, వర్షాలకు దెబ్బతిన్న అరటి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆమె జేసీ అతిథి సింగ్‌తో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించే విధంగా నివేదికలు తయారు చేయాలని సూచించారు. నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బిషప్ పట్టాభిషేకానికి పోప్ దూత రాక



కడప నగరానికి ఊరేగింపుగా వస్తున్న పోప్ దూత లియో ఫోల్డ్ జిరెల్లీ

కడప కల్చరల్: కడప కథోలిక డయాసిస్ నూతన బిషప్‌గా మోస్ట్‌రెవరెండ్ సగినాల పాల్ ప్రకాష్ బుధవారం పట్టాభిషిక్తులు కానున్న సందర్భంగా.. ముఖ్య అతిథిగా ప్రపంచ క్రైస్తవ గురువు పోప్ దూత లియో ఫోల్డ్ జిరెల్లీ హాజరు కానున్నారు. మంగళవారం ఆయన కడప నగరానికి వచ్చేశారు. ఆరోగ్యమాత, కథడ్రల్ చర్చిలను దర్శించుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన ఊరేగింపుగా భక్తులతో కలిసి కథడ్రిల్ చర్చికి వచ్చేశారు. మరియామాత, క్రీస్తు ప్రభువుకు ప్రార్థనలు చేశారు. విశ్వాసులు మాతను నిత్య జపం చేయాలని, కుటుంబ ప్రార్థనలు చేయాలని మార్గ దర్శనం చేశారు. కార్యక్రమంలో నల్గొండ బిషప్ ఎండీ ప్రసాద్‌రావు, ఆరోగ్యమాత మదర్ సరేనా, ఏపీసీయూ ప్రధాన కార్యదర్శి స్వామినాథన్, ఇతర గురువులు, మదర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నేతలు

కడప అర్బన్: మనోభావాలను దెబ్బతీయడమే గాకుండా, రెచ్చగొట్టే విధంగా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ నేతలు మంగళవారం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా సోదరుడు ఎస్‌బీ అహ్మద్‌బాషాను కడప పోలీసులు ముంబయిలో అరెస్టు చేసి తీసుకువస్తున్నారని, ఆయన ఇంటి సమీపంలోని గోకుల్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కొందరు బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారని పేర్కొన్నారు. టీడీపీ నేతలు ఆర్.వి సుబ్బారెడ్డి (పాలెంపల్లి సుబ్బారెడ్డి), యువరాజ్, పఠాన్ ఖాజాపీర్, జియావుద్దీన్, పాలంపల్లి రాజా, ఆరీఫ్, సయ్యద్ ఫైజల్ వీరితోపాటు ఆ పార్టీకి సంబంధించిన 200 మంది అరగంటపాటు బాణాసంచా కాల్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కడప నగరంలో పోలీస్ 30 యాక్ట్ అమలులో వున్నా.. దాన్ని పాటించలేదన్నారు. ఫిర్యాదు చేసిన వైఎస్ఆర్‌సీపీ నేతలలో బంగారు నాగయ్య యాదవ్, రమేష్‌రెడ్డి, సుదర్శన్ రాయల్, నందలూరు ఫయాజ్, బి.హెచ్ ఇలియాస్ (వైఎస్ఆర్‌సీపీ గల్ఫ్ కన్వీనర్), టి.టి.డి బోర్డ్ మాజీ సభ్యులు యానాదయ్య, వైఎస్ఆర్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, కార్పొరేటర్ కె.బాబు తదితరులు ఉన్నారు.

ఇసుకాసురులు

- ప్రకృతి సంపదను బొక్కేస్తున్న అధికార పార్టీ నేతలు
- ఉచితం మాటున అక్రమంగా ఇసుక తరలింపు
- ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు





ట్రాక్టర్ల నుంచి తరలిస్తున్న ఇసుక

సాక్షి ప్రతినిధి, కడప: కూటమి పాలనలో ప్రకృతి వనరులు ధ్వంసమవుతున్నాయి. టీడీపీ ప్రజాప్రతినిధుల అక్రమ ఆదాయ కోరల్లో చిక్కి నదులు శల్యమైతున్నాయి. ఉచిత ఇసుక మాటున లూటీ చేస్తున్నారు. పాపాఘ్ని, పెన్నా నదులను చెరబట్టారు. పేరుకే ప్రభుత్వ రీచ్‌లు, పక్కనున్న గ్రామాల నుంచి యథేచ్ఛగా మిషన్లు పెట్టి లోడింగ్ చేస్తూ అక్రమంగా తరలిస్తున్నారు. కమలాపురం, కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేకుండాపోయింది. అధికారిక ఇసుక రీచ్‌ల నుంచి కాకుండా పక్క గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ ఆదాయాన్ని బొక్కేస్తున్నారు.

ప్రధాన నగరాలకు తరలింపు

కమలాపురం, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గాల నుంచి ప్రధాన నగరాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. యంత్రాలతో లోడింగ్ చేసి, భారీ టిప్పర్లతో ఇసుక కన్పించకుండా పట్ట కట్టుకొని బెంగళూరు పట్టణానికి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నదుల్లో అధికారిక రీచ్‌ల్లో ఇసుక అలాగే కొనసాగిస్తూ.. ఆ మాటున పొరుగు గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఘటన కమలాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ విషయం మైనింగ్‌శాఖలో పని చేస్తున్న చిరుద్యోగి నుంచి జిల్లా సర్వోన్నతాధికారి వరకూ అందరికీ తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. అందుకు ప్రధాన కారణం ఎమ్మెల్యేల కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండడమేనని పలువురు వివరిస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా అక్రమార్కుల నుంచి నదులను రక్షించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నదులను చెరబట్టి..

ప్రకతి సంపద అధికార పార్టీ నేతల పాలిట కల్పతరువుగా మారింది. నదులు గుల్ల అవుతున్నాయి. యథేచ్ఛగా ఇసుక లూటీ కొనసాగిస్తున్నారు. అక్రమ సంపాదన కోసం పోటీ పడుతున్నారు. చిత్రావతి, పెన్నా, పాపాఘ్ని, చెయ్యేరు నదులను చెరబట్టారు. పొక్లెయిన్ల ద్వారా లోడింగ్ చేస్తూ భారీ టిప్పర్లతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. స్థానికంగా వినియోగదారుడికి ఇసుక కావాలంటే చుక్కలు చూడాల్సి వస్తోంది. 'ఉచిత ఇసుక' తెలుగు తమ్ముళ్లకు దోపిడీ పథకంగా తెరకెక్కింది. ప్రభుత్వ రీచ్‌లు దక్కించుకుని పొరుగున ఉన్న మరో గ్రామం నుంచి ఇసుకను బాహాటంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పైడికాల్వ, కొత్తగంగిరెడ్డిపల్లె, నందిమండలం, సంబటూరు ఇసుక రీచ్‌లు నిలుస్తున్నాయి. ప్రభుత్వ ఇసుక రీచ్ నిర్వహణను దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు ఆ మాటున అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఇదే తంతు కొండాపురం, సిద్దవటం ప్రాంతాల్లో కూడా తెరపైకి వస్తోంది. అధికారిక రీచ్‌లే కాకుండా అనధికారిక రీచ్ నుంచి.. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పలువురు వాపోతున్నారు.



గొల్లపల్లె రీచ్‌లో టిప్పర్‌కు ఇసుక లోడింగ్ చేస్తున్న యంత్రాలు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: ఇటీవల ఈదురు గాలులు, వర్షానికి అరటి గెలలు నేలకూలి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురంలో ఉన్న వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారుల చేత పంట నష్టం అంచనా వేసి నివేదికలు తెప్పించుకుని నష్టపరిహారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం అరటి రైతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం ఆయన ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంకు లేఖ

కడప రైల్వేస్టేషన్‌లో టిక్కెట్లు రిజర్వు చేసుకునే సమయంలో మార్పులు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 5వ తేదీ నుంచి రిజర్వేషన్ వేళలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు మార్పు చేశారన్నారు. రైల్వే ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాత సమయాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

కోదండ రామా..
నీలమేఘశ్యామా..

- వైభవంగా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు
- వేడుకగా స్నపన తిరుమంజనం



వటపత్రశాయి అలంకారంలో దర్శనమిస్తున్న కోదండరాముడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. మూడో రోజు మంగళవారం రాత్రి సింహ వాహనంపై సీతాపతి ఊరేగారు. ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా మంగళవారం ఉదయం వటపత్రశాయి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 'కోదండ రామా.. నీలమేఘ శ్యామా, మా కోర్కెలు తీర్చు స్వామి' అని వారు వేడుకున్నారు.



విద్యుత్ దీప కాంతుల్లో వెలుగొందుతున్న ఒంటిమిట్ట రామాలయం

సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు, కడప కలెక్టర్ శ్రీధర్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు కడప జిల్లా యంత్రాంగం, టీటీడీ సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ ఈఓ జె. శ్యామలరావు వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలోని పరిపాలన భవనం సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి మీడియా సమావేశంలో ఈఓ మాట్లాడారు. సీతారాముల కల్యాణానికి చేపట్టిన ఏర్పాట్లను ఆయన వివరించారు. కల్యాణం సందర్భంగా ఏప్రిల్ 11న సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. కల్యాణ వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాలు పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి భక్తుడికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డు ప్రసాదం, కంకణం, అన్న ప్రసాదాలు అందజేస్తామన్నారు. ఆలయ సమీపంలో 3 వేల మంది భక్తులు వేచి ఉండేందుకు జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. కల్యాణోత్సవాన్ని వీక్షించేలా 21 ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సారి ఆలయ ప్రాంగణంలో కళాకృతులతో సంక్షిప్త రామాయణాన్ని ఏర్పాటు చేశామని, 30 కళాబృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామన్నారు. 13 వైద్య శిబిరాలు, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 35 మంది వైద్య నిపుణులు, 8 అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. కల్యాణోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తులు వీక్షించేందుకు హెచ్‌డీ క్వాలిటీతో ఎస్‌వీబీసీ ప్రత్యక్ష ప్రసారం అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీఎం ప్రోగ్రామ్ సమన్వయ కర్త పెందుర్తి వెంకటేష్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యార్డు.. సమస్యల్లో రికార్డు

- మార్కెట్ యార్డులో వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు
- రైతులకు తప్పని తిప్పలు



శిథిలావస్థకు చేరిన రైతుల విశ్రాంతి భవనం



నిలిచిపోయిన జంబోషెడ్డు నిర్మాణ పనులు



ఇటీవల కురిసిన వర్షానికి తడిచిపోయిన పసుపుకొమ్ములు

కడప అగ్రికల్చర్: కడప మార్కెట్‌యార్డు సమస్యల్లో రికార్డు సృష్టిస్తోంది. ఇక్కడ కనీస మౌలిక వసతులు లేకపోవడంతో.. రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి వేలకు వేలు ఖర్చు చేసి.. పంటలను కంటికి రెప్పలా కాపాడుకుని మంచి దిగుబడులు సాధిస్తే.. వాటిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. కడప మార్కెట్‌యార్డుకు జిల్లాలోని నలుమూలల నుంచి పసుపు, వేరుశనగక్కాయలను తెచ్చి అమ్ముకుంటారు. అయితే ఇక్కడ షెడ్లు లేకపోవడంతో.. ఆరుబయట, రోడ్డుపైనే ఉత్పత్తులను రాసులు పోసుకుని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి సందర్భాల్లో వర్షాలు వస్తే.. భారీగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ నెల 3వ తేదీ సాయంత్రం వచ్చిన అకాల వర్షంతో పసుపు, వేరుశనక్కాయలు తడిచిపోయాయి. వాటిపైన పట్టలు కప్పినప్పటికీ.. యార్డులో వర్షపు నీరు పోయేందుకు వీలులేక నీరంతా వాటి కిందికి చేరాయి. అవి తడిచిపోకుండా కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. మళ్లీ బస్తాకు రూ.40 చెల్లించి హమాలీలతో ఆరుబయట ఎండ పెట్టుకోవాల్సి వచ్చింది. తడిచిన సరుకు కావడంతో వ్యాపారులు ఎవరూ కొనుగోలుకు ముందుకు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తక్కువ రేటుకు అమ్ముకుని నష్టపోవాల్సి వచ్చిందని వారు వాపోయారు.

ఏళ్ల తరబడి..

కడప మార్కెట్‌యార్డుకు గతంలో రూ.84 లక్షలతో జంబో షెడ్డు మంజూరు చేశారు. దీనిని కాంట్రాక్టర్ కొంత వరకు నిర్మాణ పనులు చేపట్టి వదిలేశారు. దీంతో నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. కడుపు నిండా భోజనం చేసేందుకు కూడా సరైన హోటల్ లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

మంచినీరు.. మరుగుదొడ్లు కరువే..

మంచినీటితోపాటు మరుగుదొడ్లు కరువయ్యాయి. సీజన్‌లో రైతులు రోజుకు పదుల సంఖ్యలో వస్తారు. వీరితోపాటు వ్యాపారులు, హమాలీలు, మహిళా కూలీలు ఇలా చాలా మంది ఉంటారు. కానీ ఇక్కడ ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు. ఆరుబయట చెట్ల పొదలు, గోడ పంచకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోయారు. గతంలో అక్కడ అరకొరగా ఉన్న మరుగుదొడ్లను రోడ్డు వెడల్పులో తొలగించారు. తర్వాత నిర్మించలేదు. ఒక్క మంచినీటి కూల్ క్యాన్‌ను ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తున్నారు. ఈ నీరు అందరికీ సరిపోకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. రైతులు విశ్రాంతి తీసుకునేందుకు గతంలో విశ్రాంతి భవనం ఏర్పాటు చేశారు. అది శిథిలావస్థకు చేరుకోవడంతో ఎవరూ వినియోగించుకోవడం లేదు. చెట్ల కింద, భవనాల పంచన విశ్రాంతి తీసుకుంటున్నారు. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని వారు వేడుకుంటున్నారు.


40 బస్తాలు తడిచిపోయాయి



ఈ నెల 3వ తేదీన 40 బస్తాల పసుపును మార్కెట్ యార్డుకు తెచ్చాను. అదే రోజు సాయంత్రం ఉన్నట్లుండి వర్షం కురిసింది. దీంతో పసుపంత తడిచి ముద్దయింది. మళ్లీ హమాలీలకు బస్తాకు రూ.40 ఇచ్చి ఆరుబెట్టుకున్నాను. అయినా కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకున్నాను.

– ఓబుల్‌రెడ్డి, రైతు, తిప్పిరెడ్డిపల్లె, సికెదిన్నె మండలం

సరైన వసతుల లేవు



కడప మార్కెట్‌యార్డులో సరైన మౌలిక వసతులు లేవు. దీంతో ఆరుబయట రోడ్డుపైన వేరుశనగక్కాయలను అమ్ముకోవాల్సి వస్తుంది. సరైన గిట్టుబాటు ధర రాకుంటే.. వాటిని మళ్లీ సంచులకు ఎత్తాలి. అప్పుడు ధాన్యంతోపాటు మట్టి, దుమ్ము వస్తుంది. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.

– చిన్న సుబ్బారెడ్డి, కొత్తగిర్రిపల్లె, పెండ్లిమర్రి మండలం

ప్రతిపాదనలు పంపాము

జంబో షెడ్డుకు సంబంధించి సివిల్ వర్కు పూర్తయింది. మిగతా ఆగిన పనులకు సంబంధించి నిధుల కోసం ప్రతిపాదనలు పంపాము. నిధులు రాగానే మిగిలిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకుని వస్తాము. మిగతా సమస్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– సుబ్బారెడ్డి, ఈఈ, మార్కెటింగ్ శాఖ

కమీషన్లు తీసుకుంటారు.. వసతులు కల్పించరు



మాట్లాడుతున్న ది కడప టర్మరిక్ అసోసియేషన్ నాయకులు

కడప అగ్రికల్చర్: 'కడప మార్కెట్‌యార్డులో అధికారులు అమ్మకాలపై కమీషన్లు తీసుకుంటారు కానీ వసతులు కల్పించడం లేదు' అని ది కడప టర్మరిక్ అసోసియేషన్ నాయకులు ధ్వజమెత్తారు. కడప మార్కెట్‌యార్డులో మంగళవారం వారు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు జవహర్లాల్ చౌదరి, సెక్రటరీ నరసింహులు, జాయింట్ సెక్రటరీ గుర్రకొండ మహేష్ మాట్లాడారు. రూ.లక్షకు వెయ్యి కమీషన్ తీసుకుంటారని, ఏటా కోట్లలో వ్యాపారం జరుగుతుందని తెలిపారు. రైతులు ఉత్పత్తులు అమ్మకపోతే, వాటిని నిల్వ చేసుకునేందుకు సరైన గోడౌన్‌ల సౌకర్యం లేదన్నారు. యార్డులోని షాపులకు సంబంధించి కడప కార్పొరేషన్‌కు ఏడాదికి ఒక్క భవనానికి రూ. 44 వేల పన్ను కడతామని, అలాంటి భవనాలు 35కు పైగా ఉన్నాయన్నారు. అటు కార్పొరేషన్ అధికారులు కానీ, ఇటు మార్కెట్ అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. యార్డు లోపల రోడ్లు కూడా సరిగా లేవన్నారు. అన్ని గుంతలేనన్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన నీరంతా వచ్చి చేరుతుందన్నారు. ఇన్ని అసౌకర్యాల మధ్య రైతులు యార్డుకు ఎలా వస్తారన్నారు.

బస్తాకు రూ.9.18 నుంచి రూ.13.50 పెంచారు

యార్డులో కొనుగోలు చేసిన పసుపును నిల్వ ఉంచుకునేందుకు సీడబ్ల్యూసీ గోడౌన్‌లో స్టాక్ ఉంచుకుందామంటే.. గోడౌన్ వారు ఎక్కడా లేని ధరలు పెంచారన్నారు. మొన్నటి వరకు రూ.75 కిలోల బస్తాకు నెల బాడుగ కింద రూ.9.18 తీసుకునే వారని, అలాంటిది ఏప్రిల్ నుంచి ఎలాంటి సమచారం లేకుండా రూ.13.50 పెంచారన్నారు. కడప మార్కెట్ యార్డు నుంచి 2500 బస్తాల నుంచి 4 వేల బస్తాల పసుపు వస్తుందన్నారు. ఇన్ని బస్తాలకు ఎంత మొత్తంలో చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులకే కాకుండా రైతుల వద్ద కూడా అంతే వసూలు చేస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు చంద్రప్రకాశ్ చోప్రా, బాబూలాల్ చోప్రా, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ జవహర్లాల్ చౌదరి, రాజగోపాల్‌రెడ్డి, కాలేమనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న నిరసన



ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న సిబ్బంది

జమ్మలమడుగు : క్యాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిరసన మంగళవారం రెండో రోజు కూడా కొనసాగింది. సీఎస్ఐ క్యాంప్‌బెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అగస్టీన్ రాజును తొలగించడం అన్యాయమని ఆయనను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైస్ చైర్మన్ ప్రత్యూష మాట్లాడుతూ యలసీమ డయాసిస్‌లో ఎలాంటి సమావేశం జరగకుండా, ఓటింగ్ నిర్వహించకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఇలా ఎవరుపడితే వారు అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుని ఆసుపత్రి భవిష్యత్తును భ్రష్టు పట్టిస్తున్నారన్నారు.

బెల్టు షాపులపై విస్మృత దాడులు



కేసు వివరాలను తెలియజేస్తున్న సీఐ గోపీకృష్ణ

కమలాపురం/ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఎక్సైజ్ శాఖ పరిధిలో కమలాపురంలో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై విజయవాడ నుంచి వచ్చిన ఎస్‌టీఎఫ్ బృందం దాడులు నిర్వహించినట్లు ఎర్రగుంట్ల ఎక్సైజ్ శాఖ సీఐ గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కమలాపురంలో విస్తృతంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని ఎస్‌టీఎఫ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ వర్మకు ఫిర్యాదులు అందాయన్నారు. ఆ మేరకు విజయవాడ నుంచి ఎస్‌టీఎఫ్ స్క్వాడ్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో కమలాపురంలో ఉన్న రెండు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడులలో రాజు అనే వ్యక్తి నిర్వహిస్తున్న బెల్టు షాపు నుంచి 44 మద్యం బాటిళ్లు, శంకర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న బెల్టుషాపు నుంచి 41 బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... బి.కొత్తకోట మండలం ఎగువ శీతివారిపల్లెకు చెందిన రమేష్(23) పనుల మీద బురకాయలకోటకు ద్విచక్రవాహనంలో వచ్చాడు. పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా బురకాయలకోట బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న కోటేశ్వర్‌రెడ్డి ద్విచక్రవాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో రమేష్‌కి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేదల నెత్తిపై కూటమి 'బండ'

- వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50ల అదనపు భారం
- జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 8,12,013
- పెంపు వల్ల అదనపు భారం రూ.4,06,00,650



కడప సెవెన్‌రోడ్స్ : పేదలపై కేంద్ర ప్రభుత్వం మరోమారు మోయలేని భారాన్ని మోపింది. వంట గ్యాస్(ఎల్‌పీజీ) ధరను సిలిండర్‌కు రూ.50లు చొప్పున చమురు కంపెనీలు పెంచాయంటూ ప్రకటించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు పెద్ద షాక్ ఇచ్చింది. పెరిగిన ధర మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. సోమవారం గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్న వారు కూడా డెలివరీ సమయంలో పెరిగిన మొత్తం కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే జీవన వ్యయం విపరీతంగా పెరిగి అవస్థలు పడుతున్న సామాన్యులకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పెనుభారంగా పరిణమించింది. నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు రోజు రోజుకూ ఆకాశానికి ఎగబాకుతున్నాయి. సామాన్యుడు ఏది కొనాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధరలు భగ్గుమంటున్న పరిస్థితుల్లో వంటగ్యాస్ భారాన్ని కూడా మోపడంపై ప్రజలు మండిపడుతున్నారు. గృహ వినియోగానికి సంబంధించిన 14.2 కేజీల సిలిండర్ ధర జిల్లాలో ఇప్పటికే రూ.900లు ఉండగా, గ్యాస్ ఏజెన్సీలు అదనంగా రూ.50లు వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు సిలిండర్ ధర రూ.50లు పెంచడంతో వినియోగదారుడు ఒక సిలిండర్ కోసం రూ.1000 సమర్పించాల్సి వస్తోంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ ధర రూ.503లు ఉండగా, తాజా పెంపుతో అది రూ.553కు పెరగనుంది. జిల్లాలో సాధారణ గృహ వినియోగ సిలిండర్లలో సింగిల్‌వి–307655, డబుల్ సిలిండర్లు–197406, దీపం కనెక్షన్లు–250532, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద కనెక్షన్లు–36962, పీఎం ఉజ్వల యోజన కనెక్షన్లు–19458 వెరసి 812013 ఉన్నాయి. నిన్నటి వరకూ ఈ మొత్తం కనెక్షన్లు కలిగిన వినియోగదారులంతా ఒక్క సిలిండర్ రూ. 900ల చొప్పున కొనుగోలు చేసేందుకు రూ.73,08,11,700 లు చెల్లించాల్సి వచ్చేది. పెరిగిన ధర నేపథ్యంలో కొనుగోలు చేస్తే రూ.77.14,12,350లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే వినియోగదారునిపై రూ.4,06,00,650ల అదనపు భారం పడుతోంది. సగటున ఒక్కో కుటుంబం సంవత్సరానికి ఆరు సిలిండర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఆ మేరకు అదనపు ధర చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదలపై మోయలేని భారం



పనిచేసుకుంటేగానీ పూట గడవని పరిస్థితుల్లో ఉన్నాము. ఇప్పుడు పనులు కూడా దొరకడం లేదు. ఇప్పటికే అన్ని ధరలు పెంచిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వంట గ్యాస్ ధరలను కూడా పెంచడం చాలా అన్యాయం. తక్షణమే పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించి మాబోటి పేదలను ఆదుకోవాలి.

– మేకల వెంకటసుబ్బమ్మ, రామరాజుపల్లె, కడప

గ్యాస్ ధర తక్షణం తగ్గించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కరెంటు చార్జీలతోపాటు అనేక భారాలు మోపింది. డీజిల్, పెట్రోల్ ధరలు కూడా పెరగడంతో ఆ ప్రభావం అన్ని నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైంది. ఈ పరిస్థితుల్లో మాలాంటి పేదవాళ్లం బతకడమే కష్టంగా ఉంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచడం సమంజసం కాదు. పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి.

– చీమలపెంట రెడ్డెమ్మ, గూడూరు దళితవాడ, కడప

ఆర్టీపీపీలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



ఆర్టీపీపీలో మాక్ డ్రిల్ అనంతరం సిబ్బందితో ఆక్టోపస్ బృందం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఆక్టోపస్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను ఆక్టోపస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) ఆదేశాల మేరకు , సోమ, మంగళవారాలలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ రాజారెడ్డి ఆధ్వర్యంలో రాంబాబు తమ కమాండోస్ బృందంతో నిర్వహించారు. ప్లాంట్‌లోకి ఉగ్రవాదులు చొరబడి ఉద్యోగులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపినప్పుడు వారిని కాపాడిన తీరును డ్రిల్‌లో ప్రదర్శించారు. ఈ డ్రిల్‌లో ఆర్టీపీపీ సీఈ గౌరీపతి, సీఐ మహమ్మద్‌రఫీ, ఆర్టీపీపీ ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి, క్రిష్ణమోహన్, ఆర్టీపీపీ ఫ్యాక్టరీ మేనేజర్ సిద్ధయ్య, అసిస్టెంట్ కమాండెంట్ క్రిష్ణయ్య, ఫైర్ ఆఫీసర్ రఘునాథ్, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నారాయణ యాదవ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని డీఎన్‌పల్లె గ్రామానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఉదయం 11గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిందని, తిరిగి ఇంటికి రాలేదని తల్లిదండ్రులు తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మంత్రిని కలిసిన జర్నలిస్టులు

పులివెందుల టౌన్ : జర్నలిస్ట్ భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఇంటిపై దాడి చేసి మహిళలను, పిల్లలను భయభ్రాంతులకు గురిచేసిన జీవీ రమణ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు. ట్రిపుల్ ఐటీ వార్తల ప్రచురణ నేపథ్యంలోనే జీవీ రమణ, అతని అనుచరులు సోషల్ మీడియా పోస్ట్‌ను సాకుగా చూపి దాడికి ప్రయత్నం చేశారన్నారు. జర్నలిస్ట్ శ్రీనాథ్ రెడ్డిది తప్పు అయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఇలా ఇంటిపైకి రావడం ఏమిటని జర్నలిస్టులు మంత్రి దృష్టికి తెచ్చారు. తిరిగి జర్నలిస్ట్‌పైన తప్పుడు కేసు బనాయించారని మంత్రికి వివరించారు. జీవీ రమణ అక్రమంగా నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ వ్యాపార సముదాయాలపైన తక్షణమే చర్యలు తీసుకోవడంతోపాటు పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి స్పందించిన మంత్రి సవిత జర్నలిస్టులకు న్యాయం చేసే బాధ్యతను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవికి అప్పగించారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు!

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న కొందరు యువకులను ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఇద్దరు క్రికెట్ బుకీలు పోలీసులకు పట్టుబడ్డారు. వీళ్లిద్దరూ యాప్ ద్వారా క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే యాప్‌లోని లావాదేవీలను పరిశీలించగా దొరసానిపల్లె, కోనేటికాల్వవీధి, రామేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు పందేలు పెట్టినట్లు తెలిసింది. దీంతో పోలీసులు వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

బుకీలు, పంటర్లు కలిసి 22 మంది వరకు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పట్టుబడిన వారిలో ఒకరిద్దరు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు బంగారు పని చేసే యువకులు ఎక్కువ మంది ఉన్నట్లు తెలుస్తోంది. క్రికెట్ బెట్టింగ్‌లో బడా బుకీల పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు.


విరిగిన విద్యుత్ స్తంభం



లావనూరు గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం

కొండాపురం : మండల పరిధిలోని లావనూరు గ్రామంలో ఇళ్ల సమీపంలో విద్యుత్ స్తంభం ఒక్కసారిగా విరిగిపడింది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. ఐదు రోజుల క్రితం ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ స్తంభం ఒరిగింది. అది మంగళవారం ఉన్నట్లుండి విరిగి పడిపోయింది. పెను ప్రమాదం తప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ సిబ్బంది వచ్చి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

వరదయ్యగారిపల్లి ఆలయంలో చోరీ



సీసీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యం

రాజంపేట : మండలంలోని వరదయ్యగారిపల్లి అక్కమ్మతల్లి ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం ఈ విషయాన్ని మన్నూరు సీఐ కులాయప్ప తెలిపారు. హుండీలు పగులకొట్టి అందులో నగదును తీసుకెళ్లిన దృశ్యాలను సీసీ పుటేజ్ ఆధారంగా రికార్డు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. క్లూస్ టీమ్ కూడా ఆలయాన్ని పరిశీలించిందన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మృతి తీరని లోటు

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సంతాప సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : విధులపట్ల ఎంతో నిబద్ధత కలిగిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.రమాను కోల్పోవడం జిల్లాకు తీరని లోటని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి అధికారిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆమె నిబద్ధత గురించి సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చెప్పడంతోనే పీజీఆర్ఎస్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈమె నియామకం తరువాత పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అన్నమయ్య జిల్లా ఎంతో వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన వ్యక్తి రమ అన్నారు. ఆమె ఎంతో మృదు స్వభావి, నిజాయితీగల అధికారిణి అని కొనియాడారు. సమావేశంలో డీఆర్ఓ మధుసూదనరావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సహదేవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మున్సిపల్ గేట్ వసూలు వేలంపాట

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ పరిధిలో గేటు వసూలు నిమిత్తం జరిగిన వేలంపాటలు తూతూ మంత్రంగా సాగాయి. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో గేటు వసూలుకు, కూరగాయల మార్కెట్ గేటు వసూలుకు ఏకపక్షంగా జరిగిన వేలంపాటలో ఇరువురు వేలం పాటదారులే పాల్గొనడం గమనార్హం. మార్కెట్ గేటు, టౌన్ గేటు వసూలును జీఎస్టీతో కలిపి మొత్తంగా రూ.10.1 లక్షలకే వేలంపాటదారులకు అప్పజెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన బడానేత ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు గేటు వేలం పాటను తక్కువకే నిర్ణయించడం ద్వారా మున్సిపల్ ఆదాయానికి భారీగా గండికొట్టారన్న విమర్శలు ఉన్నాయి. రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ గేటుకు జరిగిన వేలం పాటలో రూ.3.20 లక్షలకు వై.రెహానా దక్కించుకున్నారు. ఈ మొత్తం జీఎస్టీతో కలిపి రూ.3,87,800 గా అధికారులు నిర్ణయించారు. టౌన్ గేటుకు సంబంధించి జరిగిన వేలంపాటలో ఎస్. జమీలున్ రూ.5.20 లక్షలకు దక్కించుకున్నారు. ఈ మొత్తం జీఎస్టీతో కలసి రూ. 6,14 లక్షలుగా తేల్చారు. మొత్తం రెండురకాల గేటువ సూలు హక్కులు రూ.10 లక్షల వెయ్యి రూపాయలకు వేలం పాటదారులు దక్కించుకున్నారు. మున్సిపాలిటీకి ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెట్టే టౌన్, మార్కెట్‌గేట్‌ల వేలం హక్కులను తక్కువ మొత్తానికి వేలం పాటదారులు దక్కించుకోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది.

చింతచెట్టు కోసిన ఐదుగురిపై కేసు నమోదు

మదనపల్లె : పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, చింతచెట్టును కోసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని దేవళంవీధికి చెందిన వెంకటరమణ భార్య జగదీశ్వరికి తన తల్లి రామలక్ష్మమ్మ పేరుపై సర్వేనెం.144, 145లో 25 సెంట్ల పొలం ఉమ్మడి ఆస్తిగా ఉంది. ఈనెల 6న రామారావు కాలనీకి చెందిన మాదిన భాస్కర్, అతని భార్య మాదిన శాంతమ్మలు అంకిశెట్టిపల్లె మార్గంలో ఉన్న జగదీశ్వరి పొలంలోకి అక్రమంగా వెళ్లి అందులో ఉన్న రూ.లక్ష విలువచేసే చింతచెట్టును కోసివేశారు. జగదీశ్వరి కుటుంబసభ్యులు అక్కడకు వెళ్లి ప్రశ్నిస్తే..ఈ పొలం మీది కాదని, ఇంకా ఎక్కువ మాట్లాడితే..మీపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని వారిని బెదిరించి దౌర్జన్యం చేశారు. దీంతో జగదీశ్వరి సోమవా రం సాయంత్రం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఏపీజీబీ తరలింపు సీమకు తీరని ద్రోహం

కలెక్టరేట్ వద్ద ఆర్‌సీపీ నిరసన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆర్‌సీపీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామీణ బ్యాంకుల విలీనంలో భాగంగా రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకులన్నింటినీ ఒకే బ్యాంకుగా చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాయలసీమకు పెను శాపంగా మారిందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. బ్యాంకుల విలీనం చేస్తూ ఆర్‌బీఐ ఇచ్చిన నోటిఫికేషన్‌ను నిరసిస్తూ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమకు చేస్తున్న అన్యాయాల లెక్కకు ఇది పరాకాష్ట అని విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి మైదుకూరు సభలో ఏపీజీబీ తరలింపు ఉండదు అని స్పష్టమైన హామీ ఇచ్చి, ఇంత అన్యాయం చేయడం ఘోరమని దుయ్యబట్టారు. ఇది రాయలసీమకు తీరని అన్యాయమని, గత 75 సంవత్సరాలుగా జరుగుతున్న మోసాల కొనసాగింపేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. 6000 కోట్ల మిగులు ఉండి, 50 వేల కోట్ల డిపాజిట్లు ఉన్న ఏకైక బ్యాంకు ఏపీజీబీ అని ఆయన అన్నారు. తక్షణమే నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బూల్ బాషా, తస్లీమ్, ప్రసాద్, మునిరెడ్డి, రమేష్, అజయ్, వినోద్, ఆప్ కీ ఆవాజ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు షాజహాన్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సేవలు అభినందనీయం

జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్లు అందజేయడం ద్వారా చెన్నైకి చెందిన యాక్సెస్ హెల్త్ కేర్ అండ్ ఫ్రీడమ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సభా భవనంలో విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 6, 7 తేదీలలో 219 మంది కాళ్లు కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు కొలతలు తీసుకున్నామన్నారు. వారందరికీ ఆధునిక కృత్రిమ కాలు ఒక్కొక్కటి రూ. 51000తో మొత్తం సుమారు రూ.67 లక్షలు విలువ చేసే ఆధునిక కృత్రిమ కాళ్లు అమర్చామన్నారు. వీరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ సుందర్, యాక్సెస్ హెల్త్‌కేర్ ప్రతినిధి ఇలవేందన్, ట్రస్ట్ మెంబర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడారు.

మందుల కోసం వచ్చాడు.. బంగారు చైన్ లాక్కెళ్లాడు



సీసీ కెమెరాలో రికార్డయిన భార్యా భర్తలు

ప్రొద్దుటూరు క్రైం : వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి పట్టపగలే బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని హోమస్‌పేటలో సుభాషిణి అనే 70 ఏళ్ల వృద్ధురాలు కొన్నేళ్లుగా ఆయుర్వేద మందులను తయారు చేసి విక్రయిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం మందులు తీసుకునేందుకు గుర్తు తెలియని భార్యాభర్తలు అక్కడికి వచ్చారు. భార్య బయట ఉండగా భర్త లోపలికి వెళ్లాడు. తన భార్యకు ఆరోగ్య సమస్య ఉందని మందులు ఇవ్వమని అడిగాడు. ఆమె మందులు ఇచ్చే క్రమంలో మెడలోని బంగారు చైన్‌ను లాక్కొని ఆమెను తోసేశాడు. దీంతో ఆమె కింద పడిపోయింది. దొంగ అక్కడి నుంచి బయటికి పరుగెత్తి భార్యతో కలిసి ఆటోలో పారిపోయాడు. వెంటనే సుభాషిణి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ యోగీంద్రలు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండున్నర తులాల బంగారు చైన్ అపహరణకు గురైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా సీసీ కెమెరాల్లో రికార్డు అయిన భార్యా భర్తల ఫొటోలను త్రీ టౌన్ పోలీసులు మీడియాకు విడుదల చేశారు. వీరిని గుర్తించిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దాలి



ఎస్‌డబ్ల్యుపీసీలో గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడుతున్న పి.ఊర్మిళాదేవి

వల్లూరు : పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. ఊర్మిళాదేవి అన్నారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామ పంచాయతీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో పర్యటించి ప్రజలతో స్వయంగా మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను, అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి, టాయిలెట్లను, ఇతర వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. వారు సమన్వయంతో పని చేసి గ్రామాన్ని ఆరోగ్యవంతంగా, పచ్చదనంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కన్సల్టెంట్ శివ నారాయణ, డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్ సూర్య ప్రకాశ్ రెడ్డి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సందీప్, వల్లూరు, వీరపునాయునిపల్లె మండలాల ఎంపీడీఓలు రఘురాం, చంద్ర శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఆర్‌సీ నాగమణి, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)



ప్రమాదం జరిగిన స్థలంలో శ్రీకాంత్

మైదుకూరు : మండలంలోని వనిపెంట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.శ్రీకాంత్ (22) అనే యువకుడు మృతి చెందాడు. బ్రహ్మంగారిమఠంలోని తెలుగు గంగ కాలనీకి చెందిన శ్రీకాంత్ మోటార్ బైక్‌పై మైదుకూరు వైపు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలతో ఉన్న అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బైక్‌పై వస్తున్న యువకుడిని కారు ఢీకొన్నట్టు పలువురు తెలిపారు. అయితే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని నిలపకుండా వెళ్లినట్టు చెబుతున్నారు. మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కడే కుమారుడు

వనిపెంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీకాంత్ తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. బ్రహ్మంగారిమఠంలోని తెలుగుగంగ కాలనీకి చెందిన కుక్కే వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు కుమార్తెల తర్వాత శ్రీకాంత్ జన్మించాడు. శ్రీకాంత్ తన బావ నిర్వహిస్తున్న టెంట్ హౌస్‌లో పనిచేస్తూ కుటుంబానికి ఆదరువుగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పుడు ప్రమాదంలో ఈ యువకుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

మతి స్థిమితం లేని మహిళ కుటుంబ సభ్యులకు అప్పగింత



మతిస్థిమితంలేని మహిళను భర్తకు అప్పగించిన చిన్నచౌక్ బ్లూ కోల్ట్స్ పోలీసులు

కడప, అర్బన్ : ఇంటినుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితిలోని మహిళను గుర్తించి తిరిగి వారి కుటుంబం చెంతకు చేర్చి శభాష్ పోలీస్. అని ప్రజల మన్ననలు పొందారు బ్లూ కోల్ట్ పోలీసులు.. వివరాల్లోకెళితే... కడప రామాంజనేయపురానికి చెందిన సత్రమ్మ అనే మతి స్థిమితం సరిగా లేని మహిళ గత రెండు రోజుల నుంచి చిన్నచౌకు పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండేది. ఈ నేపథ్యంలో బ్లూ కోల్ట్(–10) విధులలో ఉన్న కానిస్టేబుల్ బి. రాజారమేష్ నాయక్(పి.సి 2412), హోమ్‌గార్డ్ సురేష్(హెచ్.జి 138) లు మంగళవారం చిన్న చౌకు పరిధిలోని పాత బైపాస్‌లో తిరుగుతున్న మహిళను గుర్తించి చిన్నచౌకు సీఐ ఓబులేసుకు సమాచారమిచ్చారు. చిన్న చౌకు సీఐ ఓబులేసు సూచన మేరకు మధ్యాహ్నం నుంచి ఆమె కుటుంబీకుల ఆచూకీ కోసం బ్లూ కోల్ట్ సిబ్బంది శ్రమించారు. వాట్సాప్ ద్వారా మహిళ ఫొటోను విస్తృతంగా ప్రచారం చేశారు. దాదాపు 5 గంటల తర్వాత ఎట్టకేలకు రామాంజనేయపురానికి చెందిన మహిళగా గుర్తించి భర్త పరశురామ్‌కు అప్పగించారు. తన భార్యను తిరిగి తన వద్దకు అప్పగించేందుకు శ్రమించిన పోలీస్ సిబ్బందికి పరశురామ్ కృతజ్ఞతలు తెలిపారు.